
ప్రజాశక్తి
శనివారం 12 అక్టోబర్ 2024
5
పార్వతీపురం మన్యం



తిరువీధి ఉత్సవాలకు ప్రజలు సహకరించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొండ

దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శనివారం విజయదశమి కావడంతో తిరువీధి ఉత్సవాలకు ప్రజలంతా సహకరించాలని డిఎస్‌పి ఎం.రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో మాట్లాడారు. తిరువీధి ఊరేగింపునకు 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. దేవస్థానం నిబంధనల ప్రకారం ఊరేగింపు నిర్వహించడం జరుగుతుంన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30గంటల వరకు పూర్తిగా వాహనాలు రాకపోకలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో సిఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రయాగమూర్తి ఉన్నారు.

విజయనగరం ఉత్సవం చూసొద్దాం రండి

సంగీత, సాంస్కృతిక , సాహిత్య నిలయమైన విజయనగరం సంబరాలకు సిద్ధమైంది. విజయనగర ఉత్సవాలకు, పైడితల్లి అమ్మవారి జాతరకు అంగరంగ వైభవంగా ముస్తాబవుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో నిర్వహిస్తున్న మొట్టమొదటి ఉత్సవం కావడంతో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికార యంత్రాంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి చేస్తున్న విజయనగరం ఉత్సవాలు స్థానిక సంప్రదాయం ఉట్టి పడేలా , సంస్కృతి వెల్లివిరిసేలా, విజయనగరం వైభవాన్ని చాటి చెప్పేలా విజ్ఞాన, వినోద కార్యక్రమాలతో సన్నద్ధం అవుతోంది . ఇప్పటికే జిల్లాకు చెందిన మంత్రి, స్థానిక ఎమ్మెల్యే , జిల్లా కలెక్టర్ ఉత్సవాల నిర్వహణపై పలుమార్లు సమీక్షలు చేసి పలు సూచనలు జారీ చేశారు.

- సంబరాలకు సర్వం సన్నద్ధం
- గతం కంటే వైవిధ్యంగా.. వినోద భరితంగా..
- మూడు రోజుల పాటు అలరించనున్న కార్యక్రమాలు



పైడితల్లమ్మ ఆలయం వద్ద ఘటాలతో భక్తులు



విద్యుత్తు కాంతులతో ధగధగలాడుతున్న గంటస్తంభం

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి/కోట/టౌన్

విజయనగరం ఉత్సవాలను నగరంలో 12 వేదికల వద్ద నిర్వహిస్తున్నారు. ప్రతి వేదిక వద్ద అధికారుల కమిటీతోపాటు శాశ్వత సభ్యులను ఇన్‌ఛార్జులుగా నియమించారు. 13, 14 తేదీల్లో విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ పండగలో భాగంగా 14న తొలేళ్లు, 15న సిరిమానోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అమ్మవారి పండగ సందర్భంగా ఉత్సవ శోభ నగరం నలుమూలలా అలరించేలా స్వాగత ద్వారాలను, ప్రభుత్వ భవనాలపై, పార్క్ లలో, ప్రధాన కూడళ్ళ వద్ద మిరిమిట్లు గొలిపే లైటింగ్ ఏర్పాటు చేశారు. గతం కంటే భిన్నంగా, వైవిద్యంగా, ప్రత్యేకంగా ఈ ఏడాది కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. కోట వెనుక భాగంలో పైడిమాంబ చరిత్రను , విజయనగర వైభవాన్ని లేజర్ షో లుగా ప్రదర్శించడం ఈ ఏడాదికే ప్రత్యేకం . రంజని శివరంజనికి ఎదురుగా కోట పై 13, 14 తేదీలలో సాయంత్రం 6 నుండి 9 గంటల వరకు లేజర్ షో ఉంటుంది. అంతే కాకుండా ప్రతి ఏడాది అయోధ్యా మైదానంలో మెగా ఈవెంట్ ఒక్క రోజే జరిగేది. ఈ ఏడాది 13 , 14 తేదీలలో రెండు రోజులు మెగా ఈవెంట్లను నిర్వహించడం విశేషం . 13 న హైపర్ ఆది బృందం జబర్దస్త్ స్కిట్స్‌తో పాటు కోల్‌కత్తా డాన్సర్లతో బాద్ సల్సా ప్రదర్శన, ఇండియన్ ఐడల్ ఫేం సాయి ఆర్కెస్ట్రా తో వినోదాన్ని అందించ నున్నారు. 14న ప్రముఖ గాయకులూ కార్తీక్‌తో మెగా మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నారు.

13న ఉదయం జరిగే ఉత్సవ ప్రారంభ సభకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, 14న సాయంత్రం జరిగే ముగింపు కార్యక్రమానికి హోం మంత్రి అనితతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు హాజరు కానున్నారు. .

2వేల మందితో పోలీసు బందోబస్త్

ఉత్సవాల సందర్భంగా 6 జిల్లాల నుండి 2 వేల మందిని బందోబస్తు కోసం నియమించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి బందోబస్తు పర్యవేక్షించే విధంగా 80 సి సి కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసారు. ఎరియల్ సర్వే , నిఘాకు మూడు డ్రోన్స్‌ను వినియోగిస్తున్నారు.



నగరంలోని ప్రధాన రహదారుల్లో లైట్ సెట్టింగ్



విద్యుత్తు కాంతులతో ధగధగలాడుతున్న కోట

విజయనగరం ఉత్సవ కార్యక్రమాలు

- 13న ఉదయం 8 గంటలకు ఉత్సవర్యాలీ ప్రారంభం. పైడితల్లమ్మ ఆలయం నుంచి అయోధ్య మైదానం వరకు వివిధ కళారూపాలతో ర్యాలీ. 11గంటలకు అయోధ్య మైదానంలో ప్రారంభోత్సవ సభ. వివిధ వేదికల్లో నిర్వహించే ఉత్సవ కార్యక్రమాలివి...

ఆనందగజపతి కళాక్షేత్రం

- 13, 14తేదీల్లో ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 6గంటల వరకు సాంస్కృతిక, శాస్త్రీయ సంగీత నృత్య కార్యక్రమాలు.

మహారాజా కోట

- 13,14తేదీల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సైన్స్‌ఫెయిర్, స్టాంప్స్‌అండ్ కాయిన్స్‌ఎగ్జిబిషన్,ఆర్ట్ గ్యాలరీ.

గురజాడ కళాభారతి

- ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఏకపాత్రాభినయాలు, నాటికలు ప్రదర్శన.
- విజయనగరం ప్రముఖుల, కార్గిల్ యుద్ధ వీరుల ఫొటో ఎగ్జిబిషన్

విజ్జి స్టేడియం

- 13,14తేదీల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, వాలీ బాల్, స్కేటింగ్ పోటీలు

ఎం.ఆర్.లేడీస్ రిక్రియేషన్ క్లబ్

- ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు భువన విజయం, శతాధిక కవి సమ్మేళనం, సాహితీ గోష్టి, సంగీత నవ అవధానం నిర్వహణ

లయన్స్ కమ్యూనిటీ హాలు

- ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు గిరిజన కళాకారులతో థింసా నృత్యాలు, కోలాటాలు, జానపద నృత్యాలు, విజయనగర వైభవం డాక్యుమెంటరీ ప్రదర్శన.

బొంకుల దిబ్బ (కోటకు ఎదురుగా)

- సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు కన్యాశుల్కం, సత్య హరిశ్చంద్ర నాటకాల ప్రదర్శన

ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు కోట ఎదురుగా పులివేషాల ప్రదర్శన

అయోధ్య మైదానం

- 13న మధ్యాహ్నం 3 గంటల నుంచి పెట్ షో నిర్వహణ. సాయంత్రం 6గంటలకు జబర్దస్త్ హైపర్ ఆది కామెడీ ప్రదర్శన, బెంగాల్ బృందం నృత్య ప్రదర్శన, సాహితీ చాగంటి, సాయి చరణ్, అరుణ్ కౌండిన్య, దామిని భట్ల వారితో మ్యూజికల్ నైట్
- 14న సాయంత్రం 6 గంటల నుంచి ప్రముఖ సినీ, టివి, సినీ గాయకుడు కార్తీక్ మ్యూజిక్ షో.

రాజీవ్ క్రీడా మైదానం

- 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు హాట్ ఎయిర్ బెలూన్ నిర్వహణ

లోవర్ ట్యాంక్ బండ్ రోడ్

- 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ స్థాయి డ్వాక్రా ఉత్పత్తుల (సరస్) మేళా నిర్వహణ.
- 13,14 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు పుష్ప ఫల ప్రదర్శన.
- సాయంత్ర 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు కోటపై (రంజని, శివరంజని థియేటర్ ఎదురుగా) లేజర్ షో నిర్వహణ.

ఫోర్టుసిటీ వెనుక భాగంలో 12వ తేదీ నుంచి 16వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు పారా మోటరింగ్ నిర్వహణ.



దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న ఎక్సైజ్ కార్యాలయం

52మద్యం షాపులకు 1376 దరఖాస్తులు

ఒక్కొక్క షాపునకు సరాసరి 26

జిల్లా నుంచి రూ.27.52కోట్లు ఆదాయం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ప్రయివేటు దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు గడువు శుక్రవారం రాత్రి 7గంటలతో ముగిసింది. జిల్లాలో 52 షాపులకు గాను 1376 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్ కిషోర్ తెలియజేశారు. శుక్రవారం తుది వివరాలు అందేసరికి సీతానగరం సర్కిల్ 298, పార్వతీపురం 225, సాలూరు 355, కురుపాం 173, పాలకొండ 325 మొత్తం 1376 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు వచ్చిన దరఖాస్తులను ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పరిశీలించారు. ఈనెల 14న జిల్లా కలెక్టర్ సమక్షంలో మద్యం షాపుల వేలంపాట జరుగనుంది. జిల్లాలో వచ్చిన దరఖాస్తుల ద్వారా రూ.27.52కోట్ల ఆదాయం వచ్చింది.

సాలూరురూరల్ : సాలూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో భారీగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. సాలూరు, పాచిపెంట మండలం, మక్కువ మండలాల్లో 11షాపులకు గానూ 119 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా మక్కువ మండలంలో గల మూడు షాపులకు 119 దరఖాస్తులు రాగా, పాచిపెంట మండలంలో మూడు షాపులకు 81, సాలూరు పట్టణంలోని ఐదు షాపులకు 96, సాలూరు మండలంలోని రెండు షాపులకు 58 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సర్కిల్ అధికారి గుల్లిపల్లి దాసు తెలిపారు.

కురుపాం: కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 170 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు. కురుపాంలో 2షాపులకు 77, గుమ్మలక్ష్మీపురంలోని 2 షాపులకు 56, జియ్యమ్మవలసలోని రెండు షాపులకు 37 దరఖాస్తులు అందాయి.

డిఎస్‌సి ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐడిడిఎ పరిధిలో ఉన్న డిఎస్‌సి-2024 పరీక్ష కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఎంపిక కొరకు రాష్ట్రస్థాయి పరీక్షకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో వెలువడనున్న డిఎస్‌పి-2024 దళిత, గిరిజన అభ్యర్థుల కోసం విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి తదితర కేంద్రాల్లో 3 నెలల పాటు ఉచితంగా శిక్షణ నిర్వహించేందుకు గానూ గిరిజన విద్యార్థులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జన్మభూమి పోర్టల్‌లో ఈనెల 12 నుంచి 21వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని అన్నారు. హాల్ టికెట్లు ఈనెల 22నుంచి పొందవచ్చన్నారు. ఈనెల 27న అభ్యర్థి ఎంపిక చేసుకున్న సెంటర్‌లో ఆన్లైన్ పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. ఆగస్టుల 22న ఐటిడిఎ స్థాయిలో నిర్వహించిన ఆఫ్‌లైన్ పరీక్ష రద్దు అయ్యిందని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అలాగే టెట్ పరీక్ష ఉత్తీర్ణత తప్పనిసరి అని తెలిపారు.

బాలికల భవిష్యత్తుకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బాలికల ఉజ్వల్ భవిష్యత్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర మీటింగ్ హాల్లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం వేడుకలు జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బిడ్డ కడుపులో పడినప్పటి నుంచి 18 ఏళ్లు నిండి వరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి బాలికల ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఆడపిల్ల అన్న భావాన్ని విడిచిపెట్టి తల్లిదండ్రులు వారి చదువు,ఉన్నతి కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని బాలికలను ఉన్నత శిఖరాలపై నిలబెట్టినందుకు అంతా కలిసికట్టుగా పని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ పరంగా బాలికలకు అమలవుతున్న పథకాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఎంఎ రాణి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. కృష్ణమూర్తి

బడిదేవరకొండ క్వారీ పనులు ఆపాలి

- గ్రానైట్ లీజు లైసెన్స్ రద్దు చేయాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గిరిజనులు, ప్రజలు అనేక రూపాల్లో ఆందోళన చేస్తున్నా, వారి అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా బడిదేవరకొండ క్వారీ యాజమాన్యం చేపట్టిన గ్రానైట్ తవ్వకాలను వెంటనే ఆపాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నాయకులు పి.రాముతో కలిసి మాట్లాడారు. క్వారీ పనులను ఆపకపోతే రానున్న రోజుల్లో గ్రానైట్ యాజమాన్యం తీవ్రమైన ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రజలు, రైతులు, గిరిజనుల గోడు యాజమాన్యానికి ఎలాగూ పట్టదని, కనీసం ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం అన్యాయమని అన్నారు. క్వారీ పనులు ఆపాలని ప్రజలు, గిరిజనులు, రైతులు అనేక దఫాలుగా జిల్లా యంత్రాంగానికి, పాలక ప్రభుత్వాలకు విన్నవించుకుంటున్నా పెడచెవిన పెట్టడం, కార్పొరేట్లకు కొమ్ముకాయడం బాధాకరమని అన్నారు. గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వంలో నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తామని చంద్రబాబు ఎన్నికల సభల్లో వాగ్దానం చేశారని, అయితే అందుకు భిన్నంగా నేడు చాప కింద నీరులా కొండలు, గనుల తవ్వకాలకు, అక్రమ మైనింగ్ తరలింపులకు అనుమతులు ఇస్తుండడం దౌర్జన్యకరమైన చర్యని వాపోయారు.

పార్వతీపురం మండలంలోని ములగ గ్రామంలో గల బడిదేవరకొండకు 2017లో గ్రానైట్ తవ్వకాలకు అప్పటి ప్రభుత్వం అనుమతులు జారీ చేస్తే కొండ రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని, దానికి అనుమతులు ఇవ్వడం సరైనది కాదని అప్పటి ఫారెస్ట్ అధికారులు ధ్రువీకరణ ఇచ్చారని, దీనికి అనుగుణంగా కొండపై గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పోడు పట్టాలు కూడా అందించారని గుర్తు చేశారు. ఇప్పటి ప్రభుత్వం అదే బడిదేవరకొండ గ్రానైట్ మైనింగ్ లీజు లైసెన్సులు మంజూరు చేస్తూ, పట్టాలు రద్దు చేయడం సరైంది కాదన్నారు. ఈ కొండ రెవెన్యూ, ఫారెస్ట్ డిపార్ట్మెంట్లు ఉమ్మడి సర్వేలో రిజర్వ్ ఫారెస్ట్ అని తేలిన తర్వాతే 2017లో ఇచ్చిన లీజ్ లైసెన్సు రద్దు చేశారని అన్నారు. నేడు మరల ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై కొండ తవ్వకాలకు తారుమారుగా సర్వేలు చేపట్టి రికార్డులను తిరగ రాయడం అన్యాయమని అన్నారు. నాడు లైసెన్స్ అనుమతుల రద్దులో గిరిజన పోరాటం బడిదేవరకొండ చరిత్రలో నిలిచిందని, నేడు మరల తవ్వకాల పనులు చేపడితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

హామీలను ప్రభుత్వం అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి -సాలూరు

ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏ హామీలైతే ప్రజలకు ఇచ్చిందో, వాటన్నింటిని అమలు చేసి, పెరిగిపోతున్న నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం శాఖ మహాసభ ప్రారంభ సందర్భంగా గాంధీ నగరంలో సిపిఎం సీనియర్ సభ్యులు టి.పోలరాజు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు టి శంకరరావు అధ్యక్షతన జరిగిన సభలో రెడ్డి వేణు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని, నిత్యావసరాలైన పప్పులు, నూనెలు, ఉల్లి, తదితర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుకున్నాయని, కుటమి ప్రభుత్వానికి ఇవి కనిపించడం లేదని విమర్శించారు. పట్టణంలో మూతపడ్డ జూట్ మిల్లు



శాఖా మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

తెరవాలని, వంద పడకల హాస్పిటల్‌ను వెంటనే పూర్తి చేయాలి, అద్దె భవనాల్లో ఉన్న ఐటిఐ, లైబ్రరీలకు స్థలాలు ఇవ్వాలని, రైతు బజార్, టిడ్కో ఇళ్లను పూర్తిచేసి ప్రజలకు ఇవ్వాలని, గాంధీనగరం స్మశాన వాటికకు రోడ్డు వేయాలని మహాసభల్లో తీర్మానాలు ఆమోదించారు. ప్రభుత్వం ఈ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్, ఎన్‌వై నాయుడు, పట్టణ కమిటీ సభ్యులు రాముడు, శంకర్రావు, పోలరాజు, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర డిమాండ్ చేశారు. మండలంలోని బగ్గందొరవలసలో శాఖా మహాసభ శుక్రవారం జరిగింది. ఈ మహాసభలో పలు తీర్మానాలు చేశారు. ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని తీర్మానించారు. అలాగే అప్పయ్యపేటలో జరిగిన గ్రామసభ మహాసభలో స్థానిక సమస్యలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి లక్ష్మునాయుడు, మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, శాఖా కార్యదర్శులు నాగరాజు, రాము, సభ్యులు జి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ డిఎస్‌సిలో 'విజేత' విద్యార్థులకు ర్యాంకుల పంట

ప్రజాశక్తి-రాజాం

తెలంగాణ డిఎస్‌సిలో రాజాం విజేత కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రభంజనం సష్టించారు. అప్పలరాజు మాస్టార్ ఆధ్వర్యంలో అతి తక్కువ పీజుతో శిక్షణ పొందిన విద్యార్థులు చిన్న వయస్సులోనే ఉపాధ్యాయ ఉద్యోగం పొందారు. అయితే ప్రత్యేక ప్రణాళిక రూపొందించి శిక్షణ ఇవ్వడమే విజేత కోచింగ్ సెంటర్ ముఖ్య ఉద్దేశం. ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులు తెలంగాణ ఫలితాల్లో 4,8,9,13,15 ర్యాంకులు సాధించారు. కె. స్వప్న 4వ ర్యాంక్, కె. నీలవేణి 8వ ర్యాంక్, పి.హిమశ్రీ 9వ ర్యాంక్, వి.దివ్య 13వ ర్యాంక్, జ్యోత్స్న 15వ ర్యాంకు పొందారు. ఎపి డిఎస్‌సిలో కూడా ఇదే విధంగా ర్యాంక్ లు సాధించేలా శిక్షణ ఇస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన నూతన ఉపాధ్యాయులుకు కోచింగ్ సెంటర్ నిర్వాహకులు అభినందనలు తెలిపారు.



మొదటి బహుమతి విజేతకు నగదు అందజేస్తున్న నిర్వాహకులు

విజేతలకు బహుమతులు


ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దారిమల్లిలో మల్లమ్మ తల్లి దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఈనెల 10న జరిగిన డాన్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి కడగండి వలస డాన్స్ గ్రూప్ రూ.20వేలు నగదు బహుమతిని దక్కించుకుంది. ద్వితీయ బహుమతి కోడిసె డాన్స్ గ్రూప్ రూ.15వేలు నగదు బహుమతిని గెలుచుకుంది. అలాగే తృతీయ బహుమతి ఎర్రన్నగూడ (డి -క్యాబ్) నగదు రూ.10వేలు, నాలుగో బహుమతి శంభం డాన్స్ గ్రూప్ ఐదో బహుమతి జల్దాం డాన్స్ గ్రూప్, ఆరో బహుమతిగా శార డాన్స్ గ్రూప్ బృందం సభ్యులు నిలిచారు.

సంత నర్సిపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం సంత నర్సిపురంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహం, రక్తపోటు, తదితర రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం లక్ష్మి, ఆశా కార్యకర్తలు, 104సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.



బొబ్బిలిరాజుల ఆయుధ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర

ఆయుధ పూజలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

బొబ్బిలి కోటలో దసరా సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఆయుధ పూజకు స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర హాజరయ్యారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయన ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే హాజరై ఆయుధ పూజను తిలకించారు. దసరా సందర్భంగా ఆయుధాలకు బొబ్బిలి రాజులు పూజలు చేశారు. వాటి ప్రాధాన్యతను బొబ్బిలి ఎమ్మెల్యే వివరించారు. దసరా వేడుకలు ఆయుధ పూజ ప్రాముఖ్యత తదితర అంశాలను ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలుసుకుని అనంతరం దుర్గాదేవికి పూజలు చేశారు.



కృష్ణపల్లిలో పర్యటిస్తున్న లైవ్లీ హుడ్ మిషన్ బృందం సభ్యులు

ఎన్ఆర్ఎల్హెచ్ మిషన్ బృందం పర్యటన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని కృష్ణపల్లిలో శుక్రవారం నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ కేంద్ర బృందం సభ్యులు కెజి సలీం కుమార్, ఎంకె శశి యప్పన్ పర్యటించి రాష్ట్రానికి చెందిన పలు శాఖల్లో గ్రామస్థాయిలో కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాల అమలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డివిజన్కు చెందిన ముఖ్య శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ పథకాల లబ్ధిదారులను పిలిపించి మాట్లాడారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా లబ్ధిదారులకు చేరుతున్న విషయం లక్ష్యం చేసుకుని ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచి బోనురామినాయుడు, సచివాలయ కార్యదర్శి జగన్మోహన్తో పాటుగా ఉపాధిహామీ, హౌసింగ్, పంచాయతీరాజ్, వెలుగు, డిఎల్డిఒ, ఎపిడి ఎన్ఆర్ఆజీఎస్ ఎన్..రమేష్రామన్, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆధ్వర్యాన శిక్షణ ఇవ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం నారాయణ, ఇతర ప్రయివేటు విద్యా సంస్థల ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నీట్, ఐఐటి ఉచిత శిక్షణ ఇవ్వాలన్న ఆలోచన తక్షణమే ఉపసంహరించుకోవాలని గిరిజన సంక్షేమం సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ అధ్యాపకులతో ప్రభుత్వం ఆధ్వర్యాన ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత నీట్, ఐఐటి శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత శిక్షణ బాధ్యత నారాయణ విద్యా సంస్థలకు అప్పజెప్పడం ఏ మాత్రం సరైంది కాదని వారనన్నారు. ఐటిడిఎలున్న జిల్లాల్లో ఐటిడిఎ కేంద్రంగా గిరిజన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సూర్య పీఠంలో వేయి సౌర దీక్షలు పూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక శ్రీ సూర్య పీఠంలో విజయదశమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వెయ్యి సౌరదీక్షలు పూర్తయిన సందర్భంగా సౌరయాగశాల ముందు భాగంలో విజయలక్ష్మీ సూర్య ఉపస్థాన వేదికా మండపం శుభారంభం జరిగింది. ముందుగా సువాసినీ అర్చనతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్య పీఠం నిర్వాహకులు వేమకోటి నరహర శాస్త్రి మాట్లాడుతూ సూర్య పీఠంలో 1999 నుండి 24 ఏళ్ల వరకు నిరంతరాయంగా ప్రతి ఆదివారం సౌరదీక్ష నిర్వహిస్తూ వేయి ఆదిత్య పంచాయతన అరచనలు, క్షీరాభిషేకాలు, సౌర, సదర్శన హెూమాలు పూర్తయిన దివ్య సందర్భాన ఈ వేదికా నిర్మాణం చేశామని తెలిపారు. ఇది ఒక మధుర జ్ఞాపిక మండపమని అన్నారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్ శర్మ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి యూనిటీ క్రికెట్ కప్ విజేత పార్వతీపురం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సత్య సాయి సేవా సంస్థ గత రెండు రోజులుగా పార్వతీపురం మండలం వెంకంపేటలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పార్వతీపురం జట్టు విజేతగా నిలిచింది. 32 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో శుక్రవారం జరిగిన ఫైనల్స్ బిజెపురం, పార్వతీపురం జట్ల మధ్య జరిగిన పోటీలో పార్వతీపురం జట్టు విజయం సాధించింది. ఈ జట్టు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ఈ పోటీలు నవంబర్లో ముగుస్తాయని తెలిపారు.



పార్వతీపురం జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

ఏం కొనేటట్టు... ఏం తినేటట్టు లేదు

ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
సెంచరీ కొట్టిన టమోటా

ప్రజాశక్తి - సాలూరురూరల్

గత కొద్ది రోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కొనుగోలు దారులు కూరగాయలు కొనేందుకు బజారుకు వెళ్తే రూ.500 పెట్టినా కనీసం చేతి సంచి కూడా నిండకుండా ఉండడంతో చాలా అవస్థలు పడుతున్నారు. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు ఇలా ఉంటే ఏ కూరగాయని కూడా తినలేము, కొనలేమని సామాన్యులు వాపోతున్నారు. ఈ సంవత్సరం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు వల్ల కూరగాయల పంటలపై ప్రభావం చూపింది. దీని విస్తీర్ణంతో పాటు దిగుబడి కూడా తగ్గింది. దీంతో కూరగాయలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకోవాల్సి వస్తుంది. రవాణా చార్జీలు కూడా అధిక అవుతుండడంతో వీటన్నింటికీ కలిపి ధరలు అధికమవుతున్నాయని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. మరో పక్క ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ, సంక్షేమ వసతి గృహాల్లో గల విద్యార్థులు, గర్భిణుల పోషకాహారం మీద ప్రభావం చూపుతుంది. పెరిగిన ధరల వల్ల ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం సరైన పౌష్టికాహారం అందించలేకపోతున్నారు. కూరగాయలు కొనలేక అరకొరగానే విద్యార్థులకు, గర్భిణీలకు వండి పెడుతున్నారు.

సెంచరీ కొట్టిన టమాటో

నిత్యం అన్ని వంటల్లో వాడే టమోటో కిలో వంద రూపాయలు దగ్గరకు చేరుకోవడంతో సామాన్యులు టమోటాను మార్కెట్లో ముట్టలంటే షాక్ కొట్టినంత పనిఅవుతుంది. సాలూరు పరిసరాల్లోని రామభద్రపురం, సాలూరులో ప్రతి రోజూ వివిధ ప్రాంతాల నుండి కూరగాయలు వస్తుంటాయి. బెండకాయలు, కాకరకాయలు, బీరకాయ, పచ్చి మిరప, కేరట్, బీట్ రూట్లు కిలో 60 నుంచి 70 రూపాయిలు ఉండగా, చిక్కుడు, క్యాలీఫ్లవర్ కిలో 80 నుండి వంద రూపాయిలు ధర పలుకుతుంది. ఉల్లి ధర అయితే రోజు రోజుకు పెరుగుతూనే వుంది. ముఖ్యంగా కూరగాయలు ఈ ప్రాంతంలో అరకొర మాత్రమే రైతులు పండించడంతో సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడ మార్కెట్కు రావడం వల్ల రవాణా చార్జీలతో కలిపి సామాన్యుడుపై అధిక భారం పడుతుంది. దీనికి తోడు ఇక్కడ దళారులు కృత్రిమ కొరతను సృష్టించడంతో కూరగాయలను ముట్టుకోవాలంటేనే భయపడుతున్నారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ దళారులను అదుపుచేసి సామాన్యులు కూరగాయలను కొనుగోలు చేసేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఘనంగా కోటకొండ దుర్గమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీలో గల గిరి శిఖర గ్రామమైన కోటకొండ గ్రామశిఖరంలో మన్యం ప్రాంతానికి చివర రెండు కొండలు నడుమున వెలసిన దుర్గమ్మ ఉత్సవాలు దసరా సందర్భంగా ఘనంగా నిర్వహించారు. అటు భామిని మండలం నుంచి ఇటు కురుపాం మండలం గ్రామాల ప్రజలు ఆరాధ్యదైవంగా ఎన్నో ఏళ్లుగా దుర్గమ్మ పండగను ఘనంగా నిర్వహిస్తారు. గిరిజనులు తమ ఇంట్లో జరిగే ప్రతి శుభకార్యానికి ముందుగా దుర్గమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేయడం పురాతనకాలం నుంచి సంప్రదాయంగా వస్తోంది. ఆది, బుధవారాల్లో వందలాది మంది భక్తులు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఆది, బుధ, శుక్రవారాల్లో చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిమంది ప్రజలు దుర్గమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులను చెల్లిస్తారు.



పురాతన కాలం నుండి వెలిసిన దుర్గమ్మ తల్లి

సుమారు వందేళ్ల క్రితం వెలసిన కోటకొండ దుర్గమ్మ గిరిజన గ్రామాల గిరి శిఖర ప్రాంతంలో సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అప్పుడు ప్రజలు కొండల మధ్య నడుచుకుంటూ వెళ్లి పూజలు చేసేవారు. గిరి శిఖర గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం ఉండేది కాదు. ఆ సమయంలో కొండల్లో వెలిసిన రెండు దుర్గమ్మ ఆకారంలో ఉన్నటువంటి రాతి విగ్రహాలను ఒక వ్యక్తి రెండు ముక్కలు చేసి పడేసినప్పటికీ అవి మళ్లీ కలిసి దుర్గమ్మ తల్లి ఆకారంలో ఉంటే వచ్చేవని, ఆ పని చేసిన వ్యక్తి అనారోగ్యం పాలయ్యే వాడని పురాతన ప్రజలు చెప్పుకొచ్చేవారు. దీంతో దుర్గమ్మ తల్లి వెలసిన గ్రామ పరిసర ప్రజలు ఎటువంటి కోర్కెలు కోరిన దుర్గమ్మ తల్లికి మొక్కుకున్న వారి కోర్కెలు పరిష్కారమయ్యావని, దీంతో భామిని, కురుపాం మండల గిరిజన గ్రామాల ప్రజలు దుర్గమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తూ అంచలంచలుగా అభివృద్ధి చేస్తూ, ఇప్పుడు రహదారి సదుపాయం కలగడంతో దసరా నవరాత్రుల సమయంలో తండోప తండాలుగా భక్తులు వెళ్లి పూజలను ఘనంగా నిర్వహిస్తుంటారు.

మండలంలో జి.శివడ పంచాయితీ కేంద్రానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో కొండల మధ్యన వెలిసిన దుర్గమ్మ తల్లి గుడికి కనీసం రహదారి సౌకర్యం లేనప్పటికీ కోటకొండ గ్రామానికి రహదారి వేసిన కాంట్రాక్టర్ను జి.శివడ గ్రామస్తులు గుడి కట్టించి రహదారి వేయాలని కోరగా ఆయన అందుకు అంగీకరించి గ్రామస్తులు సహకారంతో దుర్గమ్మ గుడి వరకు రహదారి మెట్లు వేయించి గుడిని నిర్మించారు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు కలిసి అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తూ వాహనాలు గుడి వద్దకు వెళ్లేలా చేయడంతో ప్రతి ఏటా దసరా నవరాత్రుల్లో దుర్గమ్మ తల్లి గుడి వద్దకు వందలాది వేలాది మంది భక్తులు మేళ తాళాలతో చేరుకుని పూజలను ఘనంగా నిర్వహిస్తుంటారు.



గుంతలు పూడ్చుతున్న ఆటో యూనియన్ కార్మికులు

శ్రమదానంతో గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి -వీరఘట్టం

వీరఘట్టం- నర్సిపురం గ్రామాల మధ్య బిటి రహదారికి ఏర్పడిన గుంతలను పూడ్చకపోవడంతో వాహనాలు మరమ్మతులకు గురతున్నాయని, వెంటనే రోడ్డుమరమ్మతులు చేపట్టాలని గత ఐదేళ్లుగా ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకున్నా ప్రయోజనం లేదు. ఆఖరుకు శ్రమదానంతో పాటు సొంత డబ్బులు వెచ్చించి రహదారికి ఏర్పడిన గుంతలను పూడ్చుతున్నట్లు ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వైశ్యరాజు మణికంఠ, కార్యదర్శి సకినాన రామకృష్ణ, వైశ్యరాజు శ్యాము, తోకల రాజు తదితరులు తెలిపారు. ప్రభుత్వాలు మారినా రహదారి మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదని, ఇదే రహదారి గుండా జియ్యమ్మవలస, కురుపాం ఆర్టిసి బస్సు సర్వీసులు నడుస్తున్నాయని అన్నారు. రోడ్డుపై ఏర్పడ్డ గోతుల వల్ల వాహనాలు మరమ్మతులకు గురికావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబాన్ని పోషించడం కష్టతరంగా మారుతోందని అన్నారు. తమ జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇ ప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరుతున్నారు .



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఎస్పి రాంబాబు

దసరా ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోన వెలిసినటువంటి మాలతమ్మ గుడి దసరా ఉత్సవాల ఏర్పాట్లను శుక్రవారం పాలకొండ డిఎస్పి రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సిబ్బందితో మాట్లాడి మాలతమ్మ తల్లి దర్శన నిమిత్తం భక్తులకు చేసిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. దర్శనానికి వచ్చే యాత్రికులకు క్యూలైన్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకొని దర్శన సౌకర్యం కల్పించాలని సూచించారు. అనంతరం మూలిగూడ జంక్షన్ వద్ద చెక్ గేట్ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్విన్పేట సిఐ హరి, ఎస్సై పి.నారాయణరావు పాల్గొన్నారు.

సాఫ్ట్బాల్లో పారాది క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-బొబ్బిలి

కర్నూలు జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పారాది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగంలో వేణు, జశ్వంత్ మూడో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో సుప్రియ, తేజస్విని, చైతన్యకుమారి ఎనిమిదో స్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు.

సమస్యల పరిష్కారానికి
21న చలో ఐటిడిఎ

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజన సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 21న తలపెట్టిన చలో సీతంపేట ఐటిడిఎ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిఒ 3అమలుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు స్పెషల్ డిఎస్సి నిర్వహించాలని, గిరిజన ప్రాంతంలో రోడ్లు పూర్తి చేసి, ఇంటిఇంటి కుళాయి ద్వారా తాగునీరు సరఫరా చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చి 4 నెలలు కావస్తున్నా సమస్యపై దృష్టి సారించకుండా మద్యంపై పూర్తి ఫోకస్ పెట్టిందనివిమర్శించారు. అందుకే పాలకొండ నియోజకవర్గం పరిధిలో గల గిరిజనులు పెద్ద ఎత్తున కదిలి మన సమస్యల పరిష్కారానికి చలో ఐటిడిఎలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బి.అప్పారావు, జె.శ్రీరాములు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్ ప్రభుదాస్

బాలికా విద్యకు ప్రాధాన్యత కల్పించాలి

ప్రజాశక్తి - భామిని

బాలికల విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించాలని హోలీక్రాస్ సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సంస్థ నిర్వహిస్తున్న జీవనోపాధుల అభివృద్ధి కేంద్రంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వల్ల కౌమారదశలో ఉన్న బాలికలు పాఠశాలలకు దూరమవుతున్నారన్నారు. బాలికలందరికీ నాణ్యమైన విద్య, గౌరవప్రదమైన జీవితం లభించేలా పలు కార్యక్రమాల ద్వారా హెూలీ క్రాస్ సంస్థ కట్టుబడి ఉందన్నారు. ఈ మేరకు సంస్థ నిర్వహిస్తున్న గ్లో క్లబ్ల్లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికల హక్కులు నొక్కిచెప్పే పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తూ బాలికల స్వరం ప్రపంచానికి వినిపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, పలువురు బాలికలు పాల్గొన్నారు.

16 తరాల నుంచి ఆయుధపూజ

ప్రజాశక్తి-బొబ్బిలి

తమ కుటుంబం 16 తరాల నుంచి ఆయుధ పూజ చేస్తున్నట్లు బొబ్బిలి రాజ వంశీయులు సుజయకృష్ణ రంగారావు, బేబినాయన తెలిపారు. దసరా సందర్భంగా శుక్రవారం బొబ్బిలి కోటలో అంగరంగ వైభవంగా ఆయుధపూజ చేశారు. రాజుల పరిపాలనలో వినియోగించిన బంగారు సింహాసనాన్ని కోటలో తమ నివాసం నుంచి దర్బార్మహల్ వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సింహాసనానికి, యుద్ధంలో వినియోగించిన ఆయుధాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం ప్రకారం ఆయుధ పూజ చేస్తున్నామని చెప్పారు.



మంచినూనె ప్యాకెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

రేషన్షాపుల ద్వారా వంట నూనె విక్రయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పేదలకు చౌక ధరల దుకాణం ద్వారా ఆయిల్ పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా దశలవారీగా అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నారని అన్నారు. పేదవాళ్లంతా మూడు పూటలా పుష్టిగా కడుపు నింపుకునేలా ప్రభుత్వం బియ్యంతో పాటు తక్కువ ధరకే పంచదార, ఆయిల్, కందిపప్పు అందిస్తుందన్నారు. గత వైసిపి పాలనలో బియ్యం తప్ప మరే ఇతర సరుకులు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ ద్వారా తక్కువ ధరకే సరుకులు అందించడం జరుగుతుందన్నారు. పామాయిల్, రిఫండ్ ఆయిల్ అందించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి ఒక్క మాటను నిలబెట్టుకుంటూ ఒకవైపు రాష్ట్ర అభివృద్ధి మరోవైపు సంక్షేమం అమలు చేస్తూ ముఖ్యమంత్రి చేస్తున్న కృషి అన్ని వర్గాలకు మంచి జరిగేలా అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో జెసి శోబిక, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కురుపాం : ప్రభుత్వ దుకాణాల్లో సరసమైన ధరలకు అందిస్తున్న పామాయిల్, రిఫైండ్ ఆయిల్ నూనెలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల కన్వీనర్ కెవి కొండయ్య అన్నారు. స్థానిక రావాడ జంక్షన్లో దుకాణం వద్ద రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పామాయిల్, ఆధార్ నూనెల అమ్మకాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ మహేంద్ర, విఆర్ఎ ఈశ్వరరావు, టిడిపి నాయకులు రమేష్, సురేష్, శ్రీను, ఆనందరావు, గౌరీ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రబృందం సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కలెక్టర్ను కలిసిన జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం

ప్రజాశక్తి - పార్వతీపురం

కేరళ నుంచి వచ్చిన జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం (నేషనల్ లెవెల్ మోనిటరింగ్ టీమ్) కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ను శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ బృందం గత 8 రోజులుగా జిల్లాలోని 11 గ్రామ పంచాయతీలను సందర్శించి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించింది. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలను సేకరించింది. జిల్లాలో పథకాల అమలుతీరు బాగుందని, పర్యవేక్షణ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. తమ పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందించినందుకు బృందం సభ్యులు కలెక్టర్కు ధన్యవాదాలు తెలిపారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ప్రధాన రహదారి

మార్కెట్ కిటకిట

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

దసరా పండగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఉన్న మార్కెట్ అమ్మకం, కొనుగోలుదారులతో శుక్రవారం కిటకిటలాడింది. శనివారం విజయదశమి సందర్భంగా భారీ, ద్విచక్ర వాహనదారులు, వ్యాపారస్తులు, యంత్ర సామాగ్రి ఉన్న ప్రతి ఒక్కరూ ఆయుధ పూజ కోసం సింధూరం, దిష్టి సామగ్రి, నిమ్మకాయలు, నల్ల జీడి పిక్కలు, అలంకరణ సామాగ్రి, పూజా సామాగ్రి, కొబ్బరికాయలు, పండ్లు, పత్రి, పూలు కొనుగోలుకు అధిక సంఖ్యలో పరిసర ప్రాంతాల నుంచి రావడంతో ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. వాహన చోదకులు, పాదచారులు ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. పండగ సమయాల్లో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాల్సిన పోలీస్ శాఖ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో రహదారిపై వ్యాపారాలు సాగించే చిరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు విమర్శలు గుప్పించడం విశేషం.

వీరేష్ చంద్రదేవ్ను కలిసిన ఎస్ఐ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక పోలీస్ స్టేషన్లో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ పి.నారాయణరావు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్చంద్రదేవ్ను శుక్రవారం కురుపాం కోటలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా శాంత భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసుగా ఉండి అధికారులు, ప్రజా పతినిధుల సహకారంతో పనిచేస్తూ అందర్నీ కలుపుకుంటూ పోతానని దానికి మీ సహాయ సహకారాలు అందజేయాలని కోరినట్లు తెలిపారు.



వీరేష్చంద్రదేవ్కు పూలమొక్కను అందజేస్తున్న ఎస్ఐ

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బాడంగి

పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని వీరసాగరం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తారకేశ్వరరావు కథనం ప్రకారం...

బొబ్బిలికి చెందిన చప్ప రామారావు (42)కు భార్య గంగ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం మండలంలోని వీరసాగరంలో ఉన్న గంగ కన్నవారింటికి వచ్చారు. రామారావు మద్యం తాగి, గొడవపడటంతో గంగ మందలించింది. దీంతో రాత్రి 8 గంటల సమయంలో రామారావు బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే వైద్యం కోసం బాడంగి సిహెచ్సికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్య కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం రామారావు మరణించాడు. ఆయన భార్య గంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.